
# పాషాణ హృదయం



**'వల్లరి'**

మూడున్నర దుక్కుల వర్షం కురిసింది. ఈదర గాలి 'రయ్' మని వీస్తోంది. పిల్లలందరూ వానకు బైటకువచ్చిన కప్పల్నిచూస్తూ వాళ్లలోవాళ్ళు చెలగాటలాడుకొంటున్నారు. మరికొందరు కాగితంతో రకరకాల పడవలు—కత్తెరపడవలు, జంటపడవలు, పెట్టెపడవలు, సీతారాముల పడవలు, సిరాబుడ్డి పడవలు—చేసి నీళ్ళలోవదుల్తున్నారు, చంటిపిల్లలు ఆనందముగా కేరింతలుకొట్టుచూ వాటిని చూస్తూ కూర్చున్నారు,

మేమంతా అరుగుమీద కూర్చున్నాం. వెచ్చని అటుకులుతిని చక్కని లంకాకుచుట్టలు వెలిగించాం. అప్పటికి మేం చలిగాలికి కొంతదూరమయ్యాం. నరసయ్య "చక్కని కథ ఒకటి మొదలుపెట్టండి" అన్నాడు. "నీవుఅంటే నీవు" అని చివరకు ఆ పని నరసయ్యమీదే పడింది. దాంతో గట్టిగా గొంతు సవరించుకొని, మొదలుపెట్టాడు. "కథ కాదుగానీ—జరిగిన కథే...ముసలి సుందరయ్య వుండేవాడు చూశారూ?"

"ఆ—అదే—రంగయ్య తండ్రికదూ."

"ఊ—అతని కథ విన్నారూ, భలే విచిత్రమైనది."

"అలానా—అయితే తొందరగా మొదలుపెట్టేయ్."

చుట్టపొగ మరోకసారి గాలిలోకి రింగులు రింగులుగా వదుల్తూ కథచెప్పడం మొదలుపెట్టాడు.

"ఒకనాడు సాయంకాలం సుందరయ్య మామూలుగా షికారువెళ్ళాడు. మనసు బాగుండక తిరిగితిరిగి ఇల్లుచేరుకొన్నాడు. అప్పటికింకా చీకటి పడలేదు. అన్నెము పున్నెమెఱుగని వారిపై చిత్తమొచ్చినట్లు కాకమ్మకథలల్లేవాళ్లకు, దుర్భాషలాడే వాళ్లకు...ఈ పాడు ప్రపంచానికి— బుద్ధి యెలా వస్తుందా? ఎప్పుడువస్తుందా??...అని, ఆలోచిస్తూ చావిట్లోకూర్చున్నాడు. కోడలు వీధిగుమ్మంలో నుంచుంది 'పచ్చారు' ఆడుకొనే పిల్లల్నిచూస్తూ. అప్పుడు సుందరయ్య "ఇంట్లోకివెళ్ళమ్మా—వీధిలో యెందుకు" అన్నాడు. అతడేదురుద్దేశంతోనూ అనలేదు పాపం. అతనలా అనేందుకు కారణం—తన చెవునపడ్డ "లోకులు పలుగాకులు" అసభ్యపు మాటలే. వందలకొద్ది డబ్బుతగులబెట్టి నాగరకతా విద్య నభ్యసించే కాలేజీకుర్రాళ్ళ వాగే ధోరణి: అంటే, 'ఒరేయ్! ఈదారిని వెల్దాం రారా. చక్కని సుందరీలలామ గుమ్మంలో నిల్చునివుంటుంది. చూపిస్తాను......' వంటి అనాగరక, అసభ్య ప్రలాపనలు ఆ ముదుసలి సుందరయ్య కర్ణాల్లో ములుకులై బాధపెట్టబట్టే.

కాని తానొకటి తలచిన దైవమొకటి చేయునట్లు, కోడలు 'నేనేమన్నా కులటవృత్తి చేస్తున్నాననుకొన్నారా—భోగందాన్ననుకొన్నావా......' అనేధోరణిలో యేకరువుపెట్టి ఘాటైన 'శాస్త్ర

ణాల్ని ఎడతెరపిలేకుండా విసిరింది సుందరయ్య మీద.

సుందరయ్య నిర్ఘాంతపోయాడు. చచ్చేంత సిగ్గుపడిపోయాడు. నాల్క కొఱుక్కున్నాడు. ''నేనటువంటి దురుద్దేశంతో చెప్పలేదమ్మా... నాకు కోడలువైనా, కూతురువైనా నీవే. నేనట్లా యీ జన్మలో యెప్పుడూ అనలేను. నేచెప్పేమాట కొంచెం ఆలకించి యీ ముసలివాడు తప్పుమాట అంటే నీయిష్టమొచ్చిన శిక్ష విధించు — నల్గురిలో చెప్పుతో కొట్టు...'' అంటూ యేమో చెప్పబోయాడు.

కాని ఆకోడలు అతడ్ని మాట్లాడనీయకుండా పెద్దగొంతుతో తనవాగ్ధాటి చూపిస్తోంది. దాంతో పాటు స్త్రీ అంబులపొదిలోవుండే ముఖ్యాస్త్రమైన యేడుపుశ్రుతిని విసిరింది.

ఆమె అనేమాటలు, తిట్లేతిట్లు వినలేని ముసలి సుందరయ్య గట్టిగా రెండుచెవులూ మూసుకొని 'రామ-రామ' అంటూ అరుగుమీద చతికిలబడ్డాడు.

రంగయ్య ఆఫీసునుండి తిరిగివచ్చి ఆ ఘోర సంగ్రామఘోష విని నిర్ఘాంతపొయ్యాడు. భార్య, భర్తను చూచి శ్రుతిస్థాయి హెచ్చించి మఱింత రెచ్చిపోవడమూ, ముసలాడు కిక్కురుమనకుండా కూర్చుండటము, మీదుమిక్కిలి కొడుకునిచూచి ఉలిక్కిపడడము ఆతనిలో పెద్దదోషం వుందని, తప్పు అతనిదేనని రంగయ్య సమయస్ఫూర్తి నిలకడలేని బుర్ర నిర్ణయంచేసుకుంది. దానికితోడు భార్య యేమేమి ఒరపిడిపెట్టిన నగ్నసత్యాలు చెప్పిందో, రంగయ్య, తండ్రిమీదకే విఱచుకుపడ్డాడు. వళ్లు మఱచి, అష్టకష్టాలుపడి పెంచిపెద్దచేసిన తండ్రిని నోటికివచ్చినట్లు తిట్టాడు.

ఆ ముసలాడు ఆగ్రహం పట్టలేకపోయాడు. ఏమూలో దాగివున్న వ్యక్తిత్వము, ఆత్మగౌరవము, పొడిచిపొడిచి బాధకలుగజేసాయ్. అక్కడకూ యెంతో తమాయించుకొని ''ఆడదానికి బానిసై అధముడుగా ప్రవర్తిస్తున్నావ్ నిదానించవోయ్. నిదానించు,'' అని అన్నాడు.

రోగికి పథ్యం విషమైనట్టుగా మంచిని గుర్తింపలేక, రంగయ్య దెబ్బతిన్న పాములా మఱింత వెఱ్ఱికోపంతో తెల్లబోయాడు. 'నాయింట్లో వుండేందుకు వీల్లేదు—ఫో—పొమ్మంటూ' క్రిందపడేసి ముసలాడిని మోటుగా వీధిలోనికి యీడ్చుకుపోయాడు కొంతదూరం. వేసవియెండకు కాగిన యిసుకలో చొక్కాలేని ఆపండుముసలి శరీరం 'చుఱ్ఱుచుఱ్ఱు' మని మాడిపోయింది. చావుబ్రతుకుల్లో వున్న ఆ మానసికహృదయంలోంచి 'బాబోయ్...బాబోయ్' అని రెండు పేలవములైన అరపులు వెలువడ్డాయ్.

అయిదు నిముషాలకతడు అతికష్టంమీద లేచి కూర్చున్నాడు. గుప్పెటతో ఆకాల్తూన్న యిసుకను తీసుకొని 'నీవు నాశనమవు—నాశనమూగాక' అని ముమ్మాటు శపించాడు. అంతే!

ఎవరు యెంత బలవంతంచేసినా వినకుండా అతను మూడు రోజులు అతి కఠినమైన నిరాహార వ్రతం పూని—గుక్కెడు నీళ్లైనా ముట్టకుండా వుండి రోడ్డు ప్రక్కని నిద్రమానుచెట్టుక్రింద దీర్ఘనిద్రపోయాడు. అలా ఆతడు ప్రాణాలు వదిలేశాడు.''

కథ వింటూన్న మేము భుజాన్నివున్న తుండుగుడ్డలను మొఖంమీద కొకసారి తీసుకురావలని వచ్చింది........''పాపం'' అన్నాడు పారయ్య గద్గద కంఠంతో.

నరసయ్య తిరిగి కథ చెప్పడం మొదలుపెట్టాడు. ''ముసలాడు శపించిన మూడురోజుల్లోనే రంగయ్య మంచం పట్టాడు. తీసుకు తీసుకొని ముప్పై రోజులకల్లా తండ్రిపట్టిన త్రోవే పట్టాడు—అనంత దుఃఖవారధిలోపడి గిలగిల తన్నుకొని.

తర్వాత రంగయ్య భార్య మతిచెడి,—పిచ్చాసుపత్రినుండి ఎచ్చటికో వెళ్లిపోయిందట.'' అని చెప్పి దీర్ఘనిశ్వాస మొకటి విడిచాడు నరసయ్య.

''పాషాణ హృదయం'' అని అప్రయత్నంగా, అస్పష్టంగా, మిగతా వారి నోటినుండి ఒక్కసారిగా వెలువడ్డాయ్.

అప్పటి కప్పుడే చాలా ప్రొద్దు పోయింది. ఎవరి ఇండ్లకు వారు వెళ్లిపోయారు.

అయితే— ఇందులో ఎవరిది "పాషాణ హృదయం" అని సందేహం కల్గింది మిగిలివున్న నాకు.

ఆస్తిలేకపోయినా, కాయకష్టంచేసి, నీళ్లకావడులు మోసి— చిన్నతనం నుంచీ; తల్లి చనిపోయిన తనే తల్లీతండ్రీ అయి పెంచి పెద్దవాడ్ని చేసి, చదువుచెప్పించి, నానాయాతనలు పడి నల్గురి కాళ్లూపట్టుకొని మంచి ఉద్యోగం ఇప్పించి కొద్దిలో గొప్పగా పెండ్లిచేసి—తన జీవితాన్ని చక్కని చుక్కాని, తెఱచాపలు, సరంగు గల నావలా చేసిన తండ్రిని,—చావుకు కాళ్లుచాపుకొని 'కృష్ణ రామ' అని కాలంగడిపే ముసలి తండ్రిని; కారణమేమిటో తెలుసుకోకుండా కేవలం భార్యా మమతతో, హింసించి, బాధపెట్టి—చివరకు నులిమి చంపిన ఆ రంగయ్యదా "పాషాణ హృదయం."

లేక—

అన్ని కష్టాలుపడి, కొడుకు జీవితాన్ని సమస్త సరంజామాతోను నిండిన నౌకగా చివఱకు విధి బలవత్తరమై, మమతచే, క్షణికమైన కోపాగ్నికీలలో చిక్కుకొని, ఒడలు తెలియని పనొకటి చేయుటవల్ల ఎందులకు పనికి రాకుండా తాను నిర్మించిన రంగైన ఆ రంగారు నౌకను నట్టేటిలో ముంచేసిన ఆ తండ్రి—సుందరయ్య హృదయమా "పాషాణ హృదయం."

లేక—

పసితనముచే— యౌవన గర్వముచే, లోకానుభవహీనయై— కారణం తెలుసుకోలేక తన బాగుకొఱకు చెప్పే మాటల్ని వినిపించుకోకుండా— తండ్రి తర్వాత తండ్రి అంతవాడ్ని, ముసలి పండును, బాధించి, మండుటెండలో మాడ్చేసి—చివఱకు వ్రేలు కొఱుక్కొని, పశ్చాత్తాపాగ్నిలోపడి, తెఱగులేక ఆర్తియై, విధవయై దేశదిమ్మరైన ఆ కోడలదా "పాషాణ హృదయం!!!"

మీకు ఏలాంటి రకమైన దుస్తుల అవసరం కలిగినప్పుడైనా

జ్ఞాపకముంచుకోండి

Truthful READY MADE CLOTHES

భారతదేశమంతలోనూ ప్రఖ్యాతిచెందినవి

రకానికి, మన్నికకూ, అందానికీ అత్యున్నతశ్రేణికి చెందినవి

ప్రతీచోటా ఒకే ధరలో విక్రయించబడును

భారతదేశమంతటా ఏజెంట్లు వున్నారు

THE TRUTHFUL MANUFACTURING Co., LTD.

MADURA & BOMBAY